నమస్తే తెలంగాణ

వికారాబాద్

13 | హైదరాబాద్, మంగళవారం 6 ఫిబ్రవరి 2024 | VIKARABAD


## ఎమ్మెల్యేను పరామర్శించిన మాజీ మంత్రి



ఎమ్మెల్యే యాదయ్యతో మాట్లాడుతున్న మాజీ మంత్రి సబితారెడ్డి, యువనేత కార్తీక్‌రెడ్డి

షాబాద్, ఫిబ్రవరి 5 : అనారోగ్యంతో హైదరాబాద్ నగరంలోని సోమాజిగూడ యశోదా దవాఖానలో చికిత్స పొందుతున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యను సోమవారం మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి తనయుడు కార్తీక్‌రెడ్డితో కలిసి వెళ్లి పరామర్శించారు. ఎమ్మెల్యే యాదయ్య ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆమె ఆకాంక్షించారు. వారి వెంట నవాబుపేట, మొయినాబాద్ జడ్పీటీసీలు కాలె జయమ్మ, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

## అసెంబ్లీ ఆవరణలో జ్యోతిబాపూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

- టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ మాజీ చైర్మన్ నాగేందర్‌గౌడ్
- రేపు జరిగే రౌండ్‌టేబుల్ చర్చా కార్యక్రమానికి హాజరుకానున్న ఎమ్మెల్సీ, తెలంగాణ రాష్ట్ర జాగృతి అధ్యక్షురాలు కవిత



మాట్లాడుతున్న నాగేందర్‌గౌడ్

వికారాబాద్, ఫిబ్రవరి 5 : అసెంబ్లీ ఆవరణలో జ్యోతిబాపూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ మాజీ చైర్మన్ నాగేందర్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని నాగేందర్‌గౌడ్ నివాసంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. ఈ నెల 7న బుధవారం వికారాబాద్ పట్టణంలోని గౌలికర్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్న రౌండ్‌టేబుల్ చర్చా కార్యక్రమానికి ఎమ్మెల్సీ, తెలంగాణ రాష్ట్ర జాగృతి అధ్యక్షురాలు కవిత హాజరవుతున్నట్లు తెలిపారు. పూలే యునైటెడ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో దేవదాసు, కుమ్మరి శ్రీనివాస్, ఫక్రోద్దీన్, శ్రీనివాస్ ఉన్నారు.


## మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న 'కడా'ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి

- నియోజకవర్గ ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- మున్సిపల్ అభివృద్ధికి రూ. 300 కోట్ల నిధులతో ప్రణాళిక..
- 'కడా' ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి

కొడంగల్, ఫిబ్రవరి 5 : కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని 'కడా' ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి అధ్యక్షతన పురపాలక సంఘం సాధారణ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వచ్చే ఐదేండ్లను దృష్టిలో ఉంచుకొని పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందించినట్లు తెలిపారు. మున్సిపల్ అభివృద్ధికి రూ.300 కోట్లకు పైగా నిధులతో ప్రణాళిక సిద్ధం చేసి సీఎం కార్యాలయానికి పంపించడం జరిగిందన్నారు. పట్టణ సుందరీకరణలో భాగంగా హైవే, ఆర్టీసీ శాఖలు అంబేద్కర్ కూడలిలోని వ్యాపార డబ్బాలను తొలగించాలని ఇదివరకే ఉత్తర్వులు ఇచ్చామన్నారు. ఉపాధి పొందుతున్న వారికి ఆర్టీసీ వారు కట్టించే దుకాణ సముదాయంలో ప్రాముఖ్యతను ఇచ్చేలా యోచిస్తున్నామన్నారు. వినాయక కూడలి నుంచి శ్రీ మహాలక్ష్మి వేంకటేశ్వరస్వామి దేవాలయం వరకు, వినాయక కూడలి నుంచి సీఎం నివాసం వరకు రోడ్డు వెడల్పు పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు చేశామన్నారు. అంబేద్కర్ కూడలిలో మురుగు కాలువ నిర్మాణం అప్పట్లో పనులు సరిగ్గా జరగలేదని, ప్రస్తుతం మరమ్మతులు చేపడుతామన్నారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని ప్రజలు అభివృద్ధికి సహకరించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో తక్కువ స్థాయిలో ఆదాయం ఉందన్నారు. నూతనంగా ఏర్పడిన మున్సిపాలిటీ కాబట్టి ఆదాయం సమకూర్చుకునేందుకు సమయం పడుతుందన్నారు. కొంత వరకు మున్సిపల్ పరిధిలో కార్మికులకు వేతనాలు, కాంట్రాక్టర్‌లకు బిల్లులు చెల్లించాల్సి ఉన్నది కాబట్టి ప్రభుత్వం నుంచి రూ. 50లక్షల నిధులు మంజూరు చేయించాలని కడా ప్రత్యేకాధికారిని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఉషారాణి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆశవర్కర్లు

## 2 నెలలుగా జీతాల్లేవ్!

### ఆశ వర్కర్లు, ఎంప్లాయిస్ యూనియన్ సభ్యుల ధర్నా

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 5: రంగారెడ్డి డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట సోమవారం తెలంగాణ ఆశ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో 1080 మంది ఆశ వర్కర్లు, ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు ధర్నా నిర్వహించారు. అనంతరం డీఎంహెచ్‌వో అందుబాటులో లేకపోవడంతో ఆఫీసు సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఆశ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు జి.కవిత మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి నెలా 1వ తేదీన వేతనాలు చెల్లిస్తామని చెప్పి, అమలు చేయడంలో విఫలమైందన్నారు. వెంటనే వేతనాలు చెల్లించకపోతే పీహెచ్‌సీ సెంటర్లలో విధులు బహిష్కరిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి లలిత, జిల్లా ఉపాధ్యక్షులు శైలజ, ఆశ నాయకులు పాల్గొన్నారు.



# పైసలు రాలే..

## నెల రోజులైనా పత్తి రైతులకు అందని డబ్బులు

**జిల్లాలోని పత్తి రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పత్తి విక్రయించే సమయంలో ఏదో ఒక కొర్రీ పెట్టి రైతులను ఇబ్బందులు పెట్టిన సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) పత్తిని విక్రయించిన రైతులకు డబ్బులు చెల్లించడంలోనూ తీవ్ర జాప్యం చేస్తున్నది. ఐదారు రోజుల్లోగా పత్తిని విక్రయించిన రైతులకు చెల్లింపులు పూర్తి చేస్తామంటూ సీసీఐ అధికారులు చెబుతున్నప్పటికీ.. నెలరోజులైనా డబ్బులు చేతికందకపోవడంతో కష్టాలు పడుతున్నారు. డబ్బుల కోసం ఎదురు చూడాల్సి వస్తున్నది.**

- పెండింగ్‌లో రూ.47 కోట్ల చెల్లింపులు
- సీసీఐ కేంద్రాల చుట్టూ రైతుల ప్రదక్షిణలు
- జిల్లాలో ఇప్పటి వరకు 78,370 మెట్రిక్ టన్నుల పత్తి సేకరణ
- 29,966 మంది రైతుల నుంచి రూ.543 కోట్ల విలువైన పత్తిని కొనుగోలు చేసిన సీసీఐ
- జిల్లావ్యాప్తంగా 14 పత్తి కొనుగోలు కేంద్రాలు
- దాదాపు ముగిసిన పత్తి విక్రయాలు
- మరో వారం రోజుల్లో కొనుగోలు కేంద్రాలను మూసివేసే దిశగా సీసీఐ

వికారాబాద్, ఫిబ్రవరి 5, (నమస్తే తెలంగాణ) : పత్తిని సేకరించిన అనంతరం వెంటనే బిల్లులు చేయాల్సిన సీసీఐ కొనుగోలు కేంద్రాల సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో రైతులకు చెల్లింపులు జమ కావడంలో తీవ్ర జాప్యం జరుగుతున్నట్లు మార్కెటింగ్ అధికారులు చెబుతున్నారు. కొందరు రైతుల బ్యాంకు ఖాతాలకు ఆధార్ లింక్ కాకపోవడం, ఆధార్ మ్యాపింగ్ లేకపోవడం.. తదితర కారణాలతో చెల్లింపుల్లో జాప్యం జరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. మరోవైపు జిల్లాలో ఇప్పటి వరకు రూ.543 కోట్ల విలువైన పత్తిని సేకరించగా, రూ.496 కోట్ల చెల్లింపులను రైతుల బ్యాంకు ఖాతాల్లో సీసీఐ జమ చేసింది. మరో రూ.47 కోట్ల చెల్లింపులు పెండింగ్‌లో ఉండడం గమనార్హం. ఈ నెల 3 వరకు పత్తిని విక్రయించిన 33,571 మంది రైతులకుగాను 29,966 మంది రైతులకు రూ.496 కోట్ల చెల్లింపులను పూర్తి చేశారు. పత్తి కొనుగోలు కేంద్రాలు కూడా మరో వారం రోజుల్లో మూసివేసేందుకు సీసీఐ అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాల్లో ప్రస్తుతం కేవలం 10 శాతం మేర పత్తి మాత్రమే వచ్చింది. సీసీఐ మాత్రం కొనుగోలు కేంద్రాలను మూసి వేసేందుకు చర్యలు చేపట్టింది.



**అంచనాలకు మించి పత్తి సేకరణ..**

జిల్లావ్యాప్తంగా 14 పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. తాండూరులో మారుతి, శుభం, బాలాజీ కొనుగోలు కేంద్రాలు, కోట్‌పల్లిలో సాయిబాబా కాటన్ అగ్రో ఇండస్ట్రీస్, పరిగిలో లక్ష్మీ వేంకటేశ్వర, నరసింహ, రాకంచర్ల కాటన్‌మిల్, వికారాబాద్‌లో ధరణి, సాయిబాబా, అయ్యప్ప జిన్నింగ్ మిల్లులో, మర్పల్లిలో శ్రీఅయ్యప్ప కాటన్ ట్రేడర్స్, కొడంగల్‌లో విజయ్ ఇండస్ట్రీస్ జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ కేంద్రాలతోపాటు ప్రైవేట్ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. గతేడాది 2.50 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించారు. ఈ ఏడాది 2.80 లక్షల క్వింటాళ్ల పత్తిని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకోగా, జిల్లా మార్కెటింగ్ అధికారుల అంచనాలకు మించి సీసీఐ పత్తిని కొనుగోలు చేసింది. ఇప్పటివరకు 7,83,700 క్వింటాళ్ల(78,370 మెట్రిక్ టన్నులు) పత్తిని 33,571 మంది రైతుల నుంచి కొనుగోలు చేశారు. జిల్లా మార్కెటింగ్ అధికారుల అంచనాలకు మించి 5 లక్షల క్వింటాళ్ల మేర పత్తిని సీసీఐ కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించడం గమనార్హం. అత్యధికంగా పరిగి నియోజకవర్గంలోని నరసింహ కాటన్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రానికి 8869 మెట్రిక్ టన్నుల పత్తి వచ్చింది. మండలాల వారీగా పరిశీలిస్తే వికారాబాద్‌లోని కొనుగోలు కేంద్రాల ద్వారా 21,709 మెట్రిక్ టన్నుల పత్తిని కొనుగోలు చేశారు. తాండూరులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా 8700 మెట్రిక్ టన్నుల పత్తిని కొనుగోలు చేయగా, కొడంగల్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం ద్వారా 2846 మెట్రిక్ టన్నులు, కోట్‌పల్లిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా 7820 మెట్రిక్ టన్నులు, ధారూరులోని కొనుగోలు కేంద్రం ద్వారా 6805 మెట్రిక్ టన్నుల పత్తి, మర్పల్లి కొనుగోలు కేంద్రం ద్వారా 6565 మెట్రిక్ టన్నుల పత్తిని రైతుల నుంచి సేకరించారు.


**త్వరగా చెల్లింపులు అయ్యేలా చర్యలు...**
**– జిల్లా మార్కెటింగ్ అధికారి సారంగపాణి**

పత్తిని విక్రయించిన రైతులకు త్వరగా చెల్లింపులు పూర్తి అయ్యేలా సీసీఐ అధికారులకు సూచిస్తామని జిల్లా మార్కెటింగ్ అధికారి సారంగపాణి తెలిపారు. బిల్లులు, ఆధార్ మ్యాపింగ్ లేకపోవడం బ్యాంకు లింకేజీ సమస్యలతో చెల్లింపుల్లో జాప్యం జరుగుతున్నట్లు వెల్లడించారు. వెనక్కి వస్తున్న బిల్లులకు మళ్లీ బిల్లులు చేసి సీసీఐకి పంపిస్తున్నామని తెలిపారు.

## అన్ని శాఖల అధికారులు హాజరు కావాలి

- ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి
- ప్రతి శాఖకూ సోషల్ మీడియాలో ట్విట్టర్ ఉండాలి
- రంగారెడ్డి కలెక్టర్ శశాంక
- ప్రజావాణికి 158 దరఖాస్తులు

రంగారెడ్డి, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ) : ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు, మండల అధికారులు, మున్సిపల్ అధికారులు ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి కచ్చితంగా హాజరు కావాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారీగా స్వీకరించిన ఫిర్యాదుల కోసం ప్రజావాణి రిజిస్టర్ నిర్వహించాలని సూచించారు. రిజిస్టర్‌లో నమోదు చేయడం వల్ల ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి?. వాటిలో ఎన్ని పరిష్కరించడం జరిగింది!.. ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయన్న విషయాలు తెలుస్తాయన్నారు. ప్రజావాణిలో స్వీకరించిన అర్జిలను పెండింగ్‌లో పెట్టకుండా పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలన్నారు. శాఖల వారీగా ప్రతి శాఖకూ సోషల్ మీడియాలో ట్విట్టర్ అకౌంట్ ఉండాలన్నారు. గ్రామ పంచాయతీలకు కేటాయించిన స్పెషల్ ఆఫీసర్లకు ఈ నెల 6వ తేదీన ఒక్క రోజు ఓరియేంటేషన్ ట్రైనింగ్ ప్రోగ్రాం ఉంటుందన్నారు. స్పెషల్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7 నుంచి 14 వరకు ప్రతి గ్రామంలోనూ శానిటైజేషన్ డ్రైవ్ కొనసాగుతుందన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 158 ఫిర్యాదులు వచ్చాయని, వాటిని వెంటనే పరిష్కరించేలా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ శశాంక

# పాలనపై పట్టింపేదీ!

## మున్సిపాలిటీల్లో కొనసాగుతున్న అవిశ్వాస తీర్మానాలు

- క్యాంపుల్లోనే ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల మున్సిపల్ కౌన్సిలర్లు
- ప్రజా సమస్యల పరిష్కారంపై నెలకొన్న స్తబ్దత
- కొత్త ప్రభుత్వంలో ముందుకు సాగని కొత్త పనులు


రంగారెడ్డి, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని మున్సిపాలిటీల్లో అవిశ్వాసాల పరంపర కొనసాగుతున్నది. కొన్ని చోట్ల కౌన్సిలర్లు క్యాంపుల్లోనే ఉన్నారు. ప్రజా సమస్యలు వినే పరిస్థితిలో పాలకవర్గాలు లేకపోవడంతో సమస్యలు పేరుకుపోతున్నాయి. పాత పనులు ముందుకు సాగకపోగా.. కొత్తగా అభివృద్ధి పనుల ఊసే లేదు. రాజకీయపరమైన అంశాలకు ప్రాధాన్యత ఇవ్వడం మినహా.. ప్రణాళికాబద్ధమైన పరిపాలనకు పాలకవర్గాలు అడుగులు వేయకపోవడంపై ప్రజల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్నది.

**క్యాంపుల్లో కౌన్సిలర్లు..**

జిల్లాలోని ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల, బండ్లగూడ మున్సిపల్ చైర్‌పర్సన్లు, వైస్ చైర్‌పర్సన్లపై ఆయా కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానాలు పెడుతూ సంబంధిత ప్రతులను జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. కలెక్టర్ అవిశ్వాస తీర్మానాలకు సంబంధించిన సమావేశాల తేదీలను ప్రకటించక ముందే ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల మున్సిపాలిటీల కౌన్సిలర్లు క్యాంపులకు వెళ్లారు. ఆదిబట్ల మున్సిపాలిటీలో అవిశ్వాస సమావేశం ఈ నెల 9న జరుగనుండగా.. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో ఈ నెల 16న నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అప్పటి వరకు కౌన్సిలర్లు క్యాంపుల్లోనే ఉండనున్నారు. పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీలోనూ అవిశ్వాస తీర్మానం దిశగా కొందరు పావులు కదుపుతున్నప్పటికీ లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ పార్టీ పెద్దలు అవిశ్వాసానికి ఒప్పుకోవడం లేదని తెలిసింది. ప్రజా సమస్యలను పట్టించుకోకుండా అవిశ్వాసాలపై దృష్టిసారించి నెలల తరబడిగా క్యాంపుల్లోనే ఉండడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**పడకేసిన పాలన..**

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నెలన్నర రోజులకు పైనే కావస్తున్నది. ప్రజా పాలన, అభయ హస్తం దరఖాస్తుల హడావుడి తప్పితే మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులతోపాటు సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలు శూన్యం. ఇక మున్సిపాలిటీల్లో చైర్మన్ల పదవీ కాలం ఇంక ఏడాది మాత్రమే ఉన్నది. చైర్మన్ పీఠంపై కూర్చునేందుకు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న ఆశావహులు అవిశ్వాస తీర్మానాల వైపుగా కౌన్సిలర్లతో అడుగులు వేయిస్తున్నారు. కౌన్సిలర్ల మద్దతు కూడగట్టుకునేందుకు చైర్మన్ ఆశావహులు ప్యాకేజీలు, తాయిలాలు ఇస్తున్నారు. దీంతో స్వపక్షం, విపక్షం అన్న తేడా లేకుండా అందరూ ఏకమై తీర్మానాలు చేస్తున్నారు. అవిశ్వాసాల నేపథ్యంలో పాలకవర్గాలు ప్రజా సమస్యలను పట్టించుకునే పరిస్థితుల్లో లేవు. కొత్త ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం కుంటుపడిందన్న భావన అందరిలోనూ ఉండగా.. త్వరలోనే లోక్‌సభ ఎన్నికల కోడ్ సైతం రానుండడంతో ఎన్నికల కోడ్‌తో అభివృద్ధి, సంక్షేమం అటకెక్కనున్నది. మున్సిపాలిటీ పాలకవర్గాలకు ఉన్న ఏడాది పుణ్యకాలం సైతం త్వరలోనే ముగియనుండడంతో ప్రజా సమస్యల పరిష్కారానికి మరింత ఆలస్యమయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రగతిని మరిచి రాజకీయాలపై పాలకవర్గాలు ప్రాధాన్యత ఇస్తుండడంపై ప్రజానీకం పెదవి విరుస్తున్నది.




## మేడారం జాతరకు 2200 సిటీ బస్సులు

ఆరు రోజుల పాటు నగరంలో 450 బస్సులే..

నిర్ణయం తీసుకున్న ఆర్టీసీ యాజమాన్యం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ) : ఈ నెల 21 నుంచి 24 వరకు నిర్వహిస్తున్న మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు సిటీ బస్సులను కేటాయిస్తూ ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయం తీసుకున్నది. గ్రేటర్ హైదరాబాద్‌లో సిటీ ప్రయాణికుల కోసం తిరిగే 2650 బస్సుల్లో 2,200 సిటీ బస్సులు మేడారం జాతరకు కేటాయించారు. దీంతో ఈ నెల 20 నుంచి 25 వరకు నగరంలో మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు, ఆర్డీనరీ బస్సులు కనిపించే ప్రసక్తే ఉండదు. కేవలం నగరంలో ఉన్న అద్దె బస్సులే ఉంటాయి. దీంతో ఆ ఆరు రోజుల పాటు నగర ప్రయాణికులు తమ గమ్య స్థానాలకు చేరుకోవడానికి అనేక ఇక్కట్లు ఎదుర్కొనక తప్పదని తెలుస్తున్నది. మరోవైపు హైదరాబాద్, సికింద్రాబాద్ వంటి గ్రేటర్ జోన్ నుంచి కూడా లక్షల సంఖ్యలో మేడారం జాతరకు వెళ్లే భక్తులకు ఆర్టీసీ ప్రత్యేక బస్సుల పేరుతో అదనపు చార్జీలు వసూలు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. అదనపు చార్జీలు వసూలు చేసే అంశం ప్రభుత్వం ప్రభుత్వ పరిశీలనలో ఉందని, త్వరలోనే దీనిపై స్పష్టత వస్తుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు.